# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 08 ఏప్రిల్, 2024 | పేజీలు : 05


## మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ



**ప్రజాపక్షం/మంథని :** మంథని మండలం కన్నాల గ్రామంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు.గ్రామానికి చెందిన కొండ లచ్చయ్య గౌడ్ తండ్రి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.అలాగే మాజీ సర్పంచ్ పొయిల రాజయ్య తల్లి, గుడిసె గట్టయ్య తల్లి మృతి చెందగా వారి కుటుంబాలను మంత్రి పరామర్శించి ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిదులు ఉన్నారు.

## మంచిర్యాల మున్సిపాలిటీలో అవినీతి దందా





వివరాలు మెయిన్‌లో...

## ఎండకు ఎడారి... వర్షాలకు గోదారి





వివరాలు మెయిన్‌లో...

## ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాక్షాంశాలు : జిల్లా ఎస్‌పి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 రోజులు సమాజ్,ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొంటూ,తమ విదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులు అందరూ సహకరించినందుకు ధన్నవాదలు,రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 11 నుండి ప్రారంభం అయ్యాయి.ఒక నెల పాటు ఉపవాసం ఉండి అల్లా ను ప్రార్దిస్తారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎక్కువ సమయం ప్రార్థనలు చేస్తారని అన్నారు.ఇస్లాం యొక్క అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటి, కుటుంబం,స్నేహితులతో కలసి భోజనం చేస్తారిని.ఏదయినా తప్పులు జరిగితే క్షమించమని అల్లాహ్ ను ప్రార్దిస్తారు.సాయత్రం ఉపవసనికి ముగించటానికి చేసేది ఇఫ్తార్ విందు. ఈ ఇఫ్తార్ విందులో పొల్గోన్నదుకు అందరికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్పీ కాంతిలాల్ ఐపిఎస్,ఎఓ యోనౌస్ అలీ,సిఐలు,ఆర్ఐ లు డి.పిఓ సుపేరిండెంట్ లు, డి.పి.ఓ స్టాఫ్,జిల్లలో పనిచేస్తున్న పోలీస్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు. .

## ఇసుక తరలించొద్దంటూ రెండవ రోజుకు చేరిన నిరాహార దీక్ష



**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి రీచ్ నుండి కాంట్రాక్టర్లు ఇసుకను తరలించవద్దంటూ డిమాండ్ చేస్తూ రీచ్ వద్ద గ్రామస్తులు నిరాహార దీక్ష చేశారు. ఆదివారంతో నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరాహార దీక్ష లోకూర్చున్న వారు మాట్లాడుతూ ఇసుక తరలింపు తో మానేరు వాగులో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఈ వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఏర్పడుతుందని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు, వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేసి కాంట్రాక్ట్ రద్దు చేసే అంతవరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయి అన్నారు. ఈ నిరాహార దీక్ష శిబిరాన్ని మానేరు పరిరక్షణ కమిటీ లీగల్ అడ్వైజర్ కోడెం అజయ్, మానేరు పరిరక్షణ కమిటీ జాయింట్ సెక్రెటరీ చిటికేష్ సతీష్ లు సందర్శించి సంఘీభావం తెలిపారు, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు , ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనాయక్ దామోదర్ రావు. ఎంపీటీసీ శీలం శంకర్, కోడి కనకయ్య , నల్లవెల్లి రాజమౌళి, గుర్రం శ్రీనివాస్, రాజారాం, కోడెం శ్రీనివాస్ , తాజుద్దీన్ పాల్గొన్నారు.

# బామ్మకు 105 ఏళ్లు.. నో షుగర్! నో బిపి



**ప్రజాపక్షం/గంగాధర:** ఓ.. బామ్మ సెంచరీ కొట్టి నాటౌట్‌గా జీవిస్తోంది.. కుటుంబ సభ్యులంతా ఆప్యాయత అనురాగాలతో ఆ శతాధిక వృద్ధురాలికి 105వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పది పదులు దాటి కుటుంబ సభ్యులు బామ్మగా పిలిచే ఆ వృద్ధురాలు ఉత్సాహంగా కేక్ కట్ చేస్తూ అందరినీ ఆనందింపజేసింది. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చెరపల్లి(ఆర్) గ్రామానికి చెందిన కురువృద్ధురాలు అమిరిశెట్టి లచ్చమ్మ ఆదివారం తన కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి 105వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంది. ఆ బామ్మకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు కాగా మనవళ్లు, మనుమరాళ్లతో కలిపి ఆ కుటుంబ సభ్యుల సంఖ్య నలభైపైనే దాటింది. మునిమనుమళ్లు, మనుమరాళ్లను చూసిన లచ్చమ్మ 1919లో పుల్కం హన్మయ్యనర్సవ్వ దంపతులకు మొదటి సంతానంగా జన్మించింది. తనకు చిన్నప్పుడే అదే గ్రామానికి చెందిన అమిరిశెట్టి నర్సయ్యతో వివాహం జరిపించారని, తనకు ముగ్గురు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు కాగా కొద్ది కాలం క్రితం భర్త, పెద్ద తమ్ముడు, పెద్ద చెల్లెలు కాలం చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు నూట అయిదు సంవత్సరాలు వచ్చినా బిపి, షుగర్ లేవని, కంటి చూపు, వినికిడి సమస్యలు సైతం లేవని లచ్చవ్వ సంతోషంగా జవాబిచ్చింది. ఆ రోజుల్లో ఎలాంటి పురుగుల మందులు వాడని బలవర్ధకమైన ఆహారం తిని రోజంతా వ్యవసాయం చేసుకుంటూ కష్టపడేవారమని తెలిపింది. ఆ రోజుల్లో ఎంత ఉత్సాహంగా ఉన్నానో ఈ నాటికి అదే విదంగా తన పని తాను చేసుకుంటానంటోంది. తన తోడబుట్టిన వారు సైతం ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని చెప్పింది. గత ఇరవై సంవత్సరాలుగా పగటిపూటంతా తన ఇంటి ముందు ఉన్న వేపచెట్టు కింద కూర్చుంటానని, అదే తన ఆరోగ్య రహస్యమంటూ నవ్వుతూ తన జ్ఞాపకాలను 'ప్రజాపక్షం'తో పంచుకుంది.

## కూచిపూడి నృత్య ప్రదర్శనలో శరణ్యకు ప్రశంస పత్రం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** శనివారం హైదరాబాదులో మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో భారతదేశ గౌరవ పురస్కారాలు 2024 కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో పట్టణంలోని విజయనగర్ కాలనీ చెందిన జి.ప్రవీణ్ రజిత దంపతుల కూతురు శరణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి భారత దేశ గౌరవ పురస్కారం తో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా చిన్నారి శరణ్యను నాట్య గురువు నవ్వ,కాలనీ వాసులు అభినందించారు.

## బూత్ స్థాయి సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ జైనూర్:** జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశనికి జైనూర్ మండల అధ్యక్షుడు షేక్ ముఖీద్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు కాంగ్రెస్ మండల నాయకులు తరలి వెళ్లారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తటియా గార్డెన్ లో జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశనికి జైనూర్ మండలం నుంచి సమేవేశనికి బూత్ స్థాయి నాయకులు, కాంగ్రెస్ మండల ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హజరయ్యారు.

## ఆమ్‌ఆద్మీపార్టీ దీక్ష విజయవంతం




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** హైదారాబాద్లో ఇంద్ర పార్క్ వద్ద నిర్వహించిన అమర నిరసన దీక్ష విజయవంతమైనది. అరవింద్ క్రేజ్వాల్ కి సంపూర్ణ మద్దతు ప్రజలకు ధన్యవాదాలని ఆమ్మ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ సయ్యాద్ హైదర్ తెలుపారు.ఇకనైనా నరేంద్ర మోడీ బుద్ధి మార్చుకుని అరవింద్ క్రేజీవల్ కి అక్రమంగా నిర్వహించిన కేసులని కొట్టేసి విడుదల చేయాలని కోరారు.

## అటకెక్కిన కాంగ్రెస్ హామీలు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండల కేంద్రంలో ఆదివారము రోజున జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మునిగిపోయిన నావా లాంటిందని అన్నారు.అంతే కాకుండా కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేరని రైతులకు రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకొచ్చారు ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం సిగ్గుచేటు అని అన్నారు.గల్లీలో ఎవరున్నా పరవాలేదు ఢిల్లీలో మాత్రం నరేంద్ర మోడీ రావాలని ప్రజలు కోరుతున్నారని ప్రజల కోరిక మేరకు నరేంద్ర మోడీ ముచ్చటగా మూడో సారి ప్రధానమంత్రి గా గెలవబోతున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ,బిఆర్ఎస్ పార్టీ, ప్రజలను మోసం చేసే పార్టీని అన్నారు.ఎవరు నమ్మద్దని బిజెపి పార్టీ ప్రజల శ్రేయస్సు కోరే పార్టీగా చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రధాన కార్యదర్శి సాబ్లె సంతోష్ సింగ్, ప్రశాంత్,ప్రవీన్,శంకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## తీగల గుట్టపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ రూరల్ మండలంలోని తీగల గుట్టపల్లిలో పోచమ్మతల్లి బోనాలు వేడుక ఘనంగా నిర్వహించారు. పోచమ్మ దేవాలయంలో జరిగిన బోనాల వేడుకలలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ తల్లి చల్లని చూపు, దయ ప్రజలందరిపై ఉండాలని, సుఖ సంతోషాలతో ప్రతి ఒక్కరు జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు బండి సంజయ్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పోరేటర్ కోలగాని శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, తీగలగుట్టపల్లి ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/ మంచిర్యాల:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సాధన గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ పెంచాల శ్రీధర్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక మూన్ లైట్ హాల్‌లో పెంచాల శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా పెంచాల శ్రీధర్, కార్యదర్శిగా తుండ్ల శ్రీనివాస్, కోశాధికారి తూర్పాటి వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లుగా రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బి. విష్ణు వర్ధన్, డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇ. మారయ్య, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్, కార్యవర్గ సభ్యులు గడ్డం సాయి కుమార్, శీలం సాయి కుమార్, రాంపురం నరేష్, ప్రేమసాయి, కౌశిక్ రావు, రేవెల్లి మహేష్, సంధ్య, జిల్లా హ్యాండ్ బాల్ క్రీడాకారులు 50మందికి పైగా పాల్గొని ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించడం జరిగింది.

## ఈ నెల 10నుంచి జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/బైంసా:** ముధోల్ నియోజకవర్గం లో రైతాంగానికి ప్రభుత్వం ద్వారా మద్దతు ధర కల్పించేందుకు ఈ నెల 10 నుంచి జొన్న కొనుగోలు కేంద్రాలు అధికారులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తెలియజేశారు.మొదట కుబీర్ మండల కేంద్రంలో కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు.మార్కెట్లో తక్కువ ధర ఉన్నందున ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు 3180 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో 16 వేల ఎకరాల్లో జొన్న పంట ఉన్నందున కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చినందువల్లే అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారన్నారు. మహారాష్ట్ర నుండి జొన్నలు రాకుండా చూసే బాధ్యత అధికారలపై స్థానిక రైతులపై ఉందని తెలియజేశారు.

## నిర్మల్ ఆసుపత్రిలో బాల భీముడు జననం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** జిల్లా కేంద్రంలో ప్రసూతి ఆసుపత్రిలో అదివారం ఉదయం బాల భీముడు జన్మించాడు.చిన్నారి జననంతోనే 4.9కిలోల బరువుతో జన్మించాడు,నిర్మల్ పట్టణానికి సమీపంలో కొద్ధీ దూరంలో ఉన్న ఆలూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే మహిళా రెండో కాన్పులో సాధారణ ప్రసవం చెందగా 4 కిలోల బరువుతో మగబిడ్డకు జన్మించాడు.తల్లి బిడ్డ ఆరోగ్యం గా ఉన్నారని అక్కడ ఉన్న వైద్యులు వెల్లడించారు.

## గౌడ సంఘం మండల తాత్కాలిక అధ్యక్షుడిగా చంద్రం



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ఆదివారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ ఆద్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన మండల కమిటీ ఏర్పాటు చేయుటకు తీర్మాణించారు. తాత్కాలిక మండల అధ్యక్షునిగా బండారుపల్లి చంద్రంను ఎన్నుకున్నారు. మండల నూతన కమిటీ ఏర్పాటు చేసే వరకు బండారుపల్లి చంద్రం తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతారని తీర్మాణించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు విజ్జగిరి గౌడ్, బొమ్మగాని వెంకటేశం, బుర్ర తిరుపతి, సుధగోని సుదర్శన్, బుర్ర పర్శరాములు, గట్టు మధు, తాళ్లపెల్లి సంపత్, బత్తిని మల్లేశం, బుర్ర శ్రీనివాస్, తాళ్లపల్లి భాస్కర్, ముంజ వెంకన్న, చెప్యాలా సంతోష్, గుడాల సంపత్, తాళ్లపల్లి కుమార్, శంకర్, అశోక్, బండారుపల్లి అంతెగౌడ్, నోముల పర్శరాం, బొంగోని రాజేశ్, బూరుగు అనంతరాములు, సభ్యులు పాల్గొన్నారు.

## మల్లన్న బోనాలకు హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి



**ప్రజాపక్షం/కడెం:** మండలంలోని కల్లెడ గ్రామంలో మల్లన్న దేవాలయం వద్ద మల్లన్న బోనాలని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్,పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్క హాజరై మల్లన్న దేవాలయంలో ప్రతేక పూజలు నిర్వహించారు.వారికి ఆలయ కమిటీ తరుపున శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీస్ రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మ,గ్రామ కమిటీ అధ్యక్షులు బత్తుల వెంకటేష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బూత్ లెవెల్ ఏజెంట్ సమావేశం





**ప్రజాపక్షం/ముధోల్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 8న సోమవారం మూడు నియోజకవర్గాల బూతు లెవెల్ ఏజెంట్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు ముధోల్ కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ రావుల గంగారెడ్డి తెలిపారు.జిల్లా కేంద్రంలోని స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు కొప్పుల రాజు,ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ముధోల్ నియోజకవర్గ ఇంచార్జి నారాయణ రావు పటేల్ హాజరవుతారని పేర్కొన్నారు.ఇట్టి సమావేశానికి బూత్ లెవెల్ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం మా సంకల్పం



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్:** పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం మా సంకల్పమని కాగజ్ నగర్ కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం కాగజ్ నగర్ మండలం ఈస్గాం నాజ్రుల్ నగర్ లోని వేద మందిర్ వద్ద కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 300 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో పేద , మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో తమ వంతు కృషి ఉంటుందన్నారు. వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ వెంకటేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ రామ్మూర్తి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ విజయ్ సూతర్ రోగులను పరీక్షించి వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో కాళిదాస్ ముజుంధర్, రానవిర్ బిస్వాస్, అమిత్ బిస్వాస్, బికాస్ గారామి, రాకేష్, కిమ్స్ హాస్పిటల్ మెడికల్ ల్యాబ్ టెక్నిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆట పాటలపై యువత మక్కువ కనబర్చాలి



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** చదువుతో పాటు యువత ఆటపాటలపై మక్కువ పెంచుకోవాలని బోలేనాథ్ కార్బల్ ట్రస్ట్ ఫౌండర్ సొంతి మోహన్ అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఆదివారం బోలేనాథ్ కార్బల్ సాబ్ ట్రస్ట్ అధ్యక్షులు మోహన్ యోగి గ్రామ యువకులకు క్రికెట్ జెర్సీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ఉత్సాహంగా రానివ్వాలని, నేటి యువతే రేపటి భవిష్యత్ అని పేర్కొన్నారు. తన సొంత గ్రామం అయిన భర్ధీపూర్‌కి ఎల్లవేళలా అలుపెరుగని సేవకై తన వంతు కృషి ఎప్పటికి ఉంటుందని అన్నారు. యువతకు ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటుందన్నారు. ఆయనతో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పట్టాభిషేక మహోత్సవం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి వేస్తున్న రామాయణ మహాకావ్యం ఘట్టం పట్టాభిషేక మహోత్సవంతో ముగిసింది. ఈ రామాయన మహాకావ్యాన్ని చూడడానికి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అన్నదమ్ములు, తండ్రి కొడుకుల మధ్య ఉన్న సంబంధాలను కళ్లకు కట్టినట్లు కళాకారులు చూపించారు. బుధవారం ప్రారంభమైన రామాయణ కార్యక్రమం శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. కార్యక్రమంలో రామాయణ గురువు బోళ్ల కొమురయ్య, సహాయకులు పడాల సత్యానారాయణ, రామాయణ కళాకారులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు హుస్సేన్, బిక్షపతి, సీత మల్లన్న, మోహన్ రెడ్డి, రాజు, జమ్మికుంట, జగ్గయ్య పల్లి సాంస్కృతిక సమాక్య అధ్యక్ష ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. రామాయణ కళాకారులు వేసిన పాత్రలు ప్రజలను ఆకట్టుకున్నారు.

## అంకత్‌పల్లిలో వెలగని వీధి దీపాలు



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్ :** మండలంలోని అంకత్ పల్లి గ్రామ పంచాయతీలో వీది దీపాలు వెలగకపోవడంతో గ్రామం రాత్రి వేళలలో అంధాకారంగా మారింది. గ్రామంలోని వీధి దీపాల కొరకు ప్రజలు ఎవరిని అడగాలో తెలియక సతమతం అవుతున్నారు. గ్రామ పంచాయితీల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన అనంతరం ప్రభుత్వం పంచాయితీల్లో ప్రత్యేక అధికారులను నియమించి పాలన సాగిస్తుంది. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు ఇతర శాఖల్లో విధులు నిర్వర్తిసుండటంతో, అందులోను ఎన్నికల సమయం కావడంతో గ్రామాల అభివృద్ధిపై కానీ, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కానీ సమయం కేటాయించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయితీల్లో అందుబాటులో ఉండకపోవడంతో గ్రామాల్లోని సమస్యలపై ఎవరిని కలవాలో తెలియక ప్రజలు తంటాలుపడుతున్నారు. అంకత్‌పల్లి గ్రామంలో వీధి దీపాలు రాకపోవడతో రాత్రి సమయంలో పంట చేన్లలోకి వెళ్ళే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అంకత్ పల్లి గ్రామం ఎల్లంపల్లి ప్రాజెక్టును ఆనుకొని ఉండటంతో ప్రాజెక్టు లోని మొసళ్లు, పాములు, ఇతర విష కీటకాల బారినపడాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/కెరమేరి:** కెరమేరి మండలంలో జిల్లా ఎస్పి సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్రబలగాలతో కలిసి అసిఫాబాద్ డిఎస్పి సదయ్య. సిఆర్‌పిఎఫ్ డివైఎస్పి రాకేష్, వాంఖిడి సిఐ శ్రీనివాస్, కెరమేరి ఎస్ఐ గుంపుల విజయ్ ఆధ్వర్యంలో మోడి, ఝరీ గ్రామాల లోని ప్రధాన రహదారులతో పాటు వీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం ఆసిఫాబాద్ డిఎస్పి సదయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి భయబ్రాంతులకు గురి కాకుండా నిర్భయంగా ఓటును వినియోగించుకోవాలని, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు కనబడితే సమచారం అందించాలన్నారు.యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణ, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడం,నేరాలు నిర్మూలించేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ బలగాలు,. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రథమ కర్తవ్యం




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ప్రజల రక్షణ, భద్రత పోలీసుల ప్రథమ కర్తవ్యం అని శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు పోలీసులు ఎల్లవేళలో అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఎస్ఐ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది సహాయంతో రాబోవు పార్లమెంటు ఎలక్షన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి కాలనీలోని ఇండ్లలో సోదాలు చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్ళినప్పుడు పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని, తమ తమ ఏరియాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలక్షన్ గురించి వివరిస్తూ వారి యొక్క ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రినగర్ లో బోడ్రాయి విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా గత శుక్రవారం నుండి ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం "ఏర్పాటు చేయడం జరిగింది. ట్రస్టు అధ్యక్షుడు డా "ఏగోలపు సదయ్య గౌడ్ మాట్లాడుతూ ఎండాకాలంను దృష్టిలో పెట్టుకుని బోడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మా ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసానన్నారు. భక్తులు, గ్రామస్థులు సదయ్య గౌడ్ కు చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ట్రస్టు సబ్యులు వేగోళం ఓం చందర్ గౌడ్, బుర్ర సతీష్ గౌడ్,బుసారపు సంపత్, ముక్కెర్ల సురేందర్, విజ్జగిరీ కొమురయ్య,బండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద రూ.60 వేలు పట్టివేత



**ప్రజా పక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీలు చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 60 వేలు నగదును పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలం జెండా గూడ గ్రామానికి చెందిన జాడి అశోక్ కారులో ఆసిఫాబాద్ వైపు నుండి వాంకిడి వెళ్తుండగా అతని వద్ద నుంచి రూ. 60వేలు పట్టుకున్నామన్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్ చేసి ఎస్ఎస్‌టి టీం కు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/ వాంకిడి:** వాంకిడి మండలంలో 33 కెవి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో సోమవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం కలుగుతుందని ఎ.డి.ఇ శ్రీనివాస్, ఎ.ఇ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఎండపల్లి మండల కేంద్రంలో మాల సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గౌరి ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షులుగా దేవి నర్సయ్య(బాబు), ప్రధాన కార్యదర్శిగా ఆల్క లచ్చయ్య, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా దేవి చుక్కయ్య, దేవిభీమయ్యలను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌరి ప్రభాకర్ మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల కృషి చేసిన కుల బాంధవులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవి భీమయ్య, కనుకయ్య, మేసు భీమయ్య, శంకరయ్య, దేవి చిన్నయ్య, దేవి ప్రవీణ్, దేవి విక్కీ, గౌరి చిరంజీవి, రవీందర్, మేసు ప్రదీప్, మనోజ్ కుమార్, మహేష్, చందు, వెంకటేష్, నగేష్, చందు, జుపాక నరేష్, పిట్ట స్వామి, పోచయ్య, అనిల్, ఆల్క ప్రశాంత్, దేవి చంద్ర కాంత్, బాబు, మహిళలు, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిశీలకులుగా మతిన్



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్మల్ అసెంబ్లీ పరిశీలకులుగా జిల్లా కేంద్రానికి చెందిన ఎం.ఎ మతిన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎఐసీసీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్,తెలంగాణ ఇన్చార్జ్ ఫర్జాన్ అజ్మీ నియమాంకలను ప్రకటించారు. ఈ సందర్భంగా మథిన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ విజయం కోసం నిర్మల్ నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని దేశంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

# పచ్చదనమే లక్ష్యంగా.. మొక్కలకు రక్షణగా చర్యలు...



ప్రజాపక్షం/కుంటాలః పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టింది. ఊరూరా పచ్చదనం పరిచేలా చర్యలు చేపట్టింది.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారు.

**పచ్చదనం పై అడుగులు...**

మండలంలోని పదో విడత హరితహారం కార్యక్రమాన్ని అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పదిహేను గ్రామ పంచాయతీలను 15 నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీలలో ఉన్న మొక్కలను బాధ్యత యుతంగా పెంచి సంరక్షించి పచ్చదనం పెంపొందించేలా కృషి చేస్తున్నారు. మొక్కలు ఎండిపోకుండా. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీల్లో మొక్కల పై భాగాన నిలువ నీడ కోసం చలువ పందిళ్ల(గ్రీన్ మ్యాట్స్) ఏర్పాటు చేయించారు. ఇందుకోసం ప్రతి నర్సరీకి రూ.3వేలు వెచిచారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీటిని పట్టిస్తున్నారు. రహదారికి ఇరువైపులా, దేవాలయాలు, మసీదులు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ మైదానాలలో మొక్కలు నాటించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. నర్సరీలలో పూలు, పండ్లు, కూరగాయలతో పాటు నీడనిచ్చే మొక్కలను పెంచి సంరక్షిస్తున్నారు. హరిత మండల దిశగా అధికారులు కృషి చేస్తున్నారు.

**మూడు పూటల నీళ్లు పట్టిస్తున్నాంః** రాజబాపు,పంచాయతీ కార్యదర్శి నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు మొక్కలకు నీళ్ల పట్టిస్తున్నాం. మొక్కల సంరక్షణ పై గ్రామంలో ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నాం.



**-(రాజబాపు, పంచాయతీ కార్యదర్శి, కుంటాల)**

**పచ్చదనంపై ప్రత్యేక దృష్టిః** గట్టుపల్లి నవీన్ ఏపీవో, కుంటాల మండలంలోని 15 నర్సరీల్లో 1 లక్ష 95వేల మొక్కలను పెంచుతున్నాం. వీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.మొక్కలు ఎండిపోకుండా వాటిపై గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయించాం. ఊరూరా పచ్చదనం పెంపొందించేదుకు కృషి చేస్తున్నాం.



**-(గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల)**

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాపక్షం/శంకరపట్నంఃద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొలంగూర్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగట్టు గ్రామానికి చెందిన అంబాల ఐలయ్య (50) మొలంగూర్‌లో ఓ హోటల్‌లో టీ తాగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన బండి సంతోష్ అనే వ్యక్తి ఐలయ్యను వెనకాల నుంచి అతివేగంతో అజాగ్రత్తగా బైక్ నడుపుకుంటూ ఢీకొనడంతో తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజిఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## రెనే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ః దేశ ప్రజారోగ్యమే సుస్థిరాభివృద్ధికి గీటు రాయి అని, ఆరోగ్యం మానవ హక్కు అని నగర మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం రెనే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, ఫ్లాష్ మాబ్లను ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్యం, విద్య ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుపుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడు దాని ప్రాధాన్యం తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ మనందరి జీవన శైలిపై ఆధారపడి ఉంటుందన్నారు. కరీంనగర్‌లో అంతర్జాతీయ స్థాయి ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించిన డా.బంగారి స్వామి వృత్తి నిబద్ధతను ప్రశంసించారు. హృదయాకార బెలూన్స్‌ను గాల్లోకి విడుదల చేస్తూ వైద్య శిబిరాన్ని నగర మేయర్ ప్రారంభించగా ఫ్లాష్ మాబ్‌ను కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రెనే హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డా.రవీంద్రచారి, గుండె వైద్య నిపుణులు డా.దినకర్, క్రిటికల్ కేర్ డా.యోగేందర్, జనరల్ మేనేజర్ మేకల అరవింద్ రావు, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు జనార్ధన్ రెడ్డి, తుమ్మల రమేష్‌రెడ్డి, శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు కెప్టెన్ బుర్ర మధుసూధన్ రెడ్డి, లయన్ ఎం.మేధర్, డా.లక్ష్మారెడ్డి, సురేందర్, అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు రమణారెడ్డి, రవీందర్ రెడ్డి, రవీందర్ , రెనే సిబ్బంది, మార్నింగ్ వాకర్స్ పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే ఓటేద్దాం



ప్రజాపక్షం/జమ్మికుంటః రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మన ఓటును ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే వేద్దామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్కు ఐలయ్య అన్నారు. ఆదివారం జమ్మికుంట, హుజురాబాద్, కేశవపట్నం,మానకొండూర్ పట్టణాల్లో కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకూ విద్వేష రాజకీయాలు పెరిగిపోతున్నాయన్నారు. రాజ్యాంగం, ప్రజల హక్కులపై పాలకులకు కనీస గౌరవం లేని పరిపాలన కేంద్రంలోనే కొనసాగుతోందన్నారు. నిరుద్యోగం, పేదరికం, దేశ ఆర్థిక స్థితిగతులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు లేకుండా చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హక్కుల గురించి మాట్లాడే వారి గొంతు నొక్కడం చూస్తూనే ఉన్నామన్నారు. అటువంటి రాజకీయ పార్టీలను ప్రజలు ఆదరించకూడదని కోరారు. ఆయనతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.అచ్యుత్ కుమార్, ఎం.కిరణ్, సదానందం, కుమార్‌లు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం/సోన్ః మండలంలోని న్యూ వెల్మల్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘ కార్యవర్గాన్ని ఆదివారం సంఘ పెద్ద మనుషుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షులుగా కొండ రవి. ఉపాధ్యక్షులుగా తలారి. ప్రణయ్,కోశాధికారిగా రాచకొండ వినోద్,సంయుక్త కార్యదర్శి గోలి శేఖర్, శాశ్వత సలహాదారులుగా మెట్టు అమృతయ్య,ఏలుగు రాజలింగం తదితరులను ఎన్నుకున్నారు.

## మూడవసారి నరేంద్రమోడీని ప్రధాని చేద్దాం



ప్రజాపక్షం/సారంగాపూర్ః లాబార్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజు మండలంలోని ఆలూరు గ్రామంలో బిజెపి రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులను ఇంటింటికి వెళ్లి కరపత్రం క్యాలెండర్లు అతికిస్తూ మూడవసారి నరేంద్ర మోడీ ని ప్రధానిగా చేయాలని ఈసారి కూడా బిజెపి ఎంపీగా కంబార్తులు ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్,టిఆర్ఎస్ రెండు కూడా కుటుంబ అవినీతి పార్టీలు ఎంఐఎంకు తొత్తుగా మారి రజాకార్ల వారసత్వాన్ని తీసుకువచ్చి తెలంగాణను అరాచక పాలనలో ముంచేతడం జరుగుతుంది మల్లొకసారి భారతీయ జనతా పార్టీని కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బిజెపి ఎంపీగా గెలిపించి నరేంద్ర మోడీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వెంకటేష్, చాణక్య చిన్నయ్య, బ్రహ్మయ్య, నివీన్ పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

ప్రజాపక్షం/శంకరపట్నంః అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదాపూర్ మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ షాబుద్దీన్ (50) తన బెల్ట్‌షాపు నిర్వహణ కోసం మండల కేంద్రం నుంచి అక్రమంగా తరలిస్తుండగా సుమారు రూ.3210 విలువ గల మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మద్యాన్ని తరలిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఓబిసి జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్



ప్రజాపక్షం/మంథనిః కాంగ్రెస్‌పార్టీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పర్వేన మోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర ఐటీ శాఖమంత్రి శ్రీధర్‌బాబు నియామకపు పత్రాలు అందజేశారు. ఆదివారం మంథనిలో జరిగిన కార్యక్రమంలో మోహన్‌కు మంత్రి చేతుల మీదుగా నియామకపు త్రాలు అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పని చేయాలని మంత్రి సూచించారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికారి కిషన్‌జీ, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ముధోల్ కన్వీనర్‌గా నరసయ్య



ప్రజాపక్షం/లోకేశ్వరంః మండలంలోని పుష్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ సంగేమ్ నరసయ్య అదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సిద్ధముకి ఆనంద్ రావు,మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్,విట్టల్ రెడ్డి మాజీ సర్పంచ్ నర్సయ్యకు ముధోల్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా నిర్మించినట్లు మాజీ సర్పంచ్ నరసయ్య తెలుపారు. కాంగ్రెస్ అధిష్ఠానం తన సేవలను గుర్తించి కన్వీనర్ పదవి ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్,విట్టల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే పార్లమెంటు సభ్యురాలిగా ఆత్రం సుగుణక్క గుర్తించినందుకు అభినందనలు తెలియజేసి సుగుణక్కను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని తెలియజేశారు,

## నంది అవార్డు గ్రహీతలకు సన్మానం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ః నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా.వేణుగోపాలకృష్ణ, ఉత్తమ దర్శకునిగా నంది పురస్కారం ప్రేమతో నాన్న ఉత్తమ లఘు చిత్రంగా ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నా డా.వేణుగోపాల కృష్ణ,సుహాసిని ఇద్దరూ వైద్య విద్యార్థులు తండ్రి,కూతురు నిర్మల్ వాస్తవ్యులు కావడం విశేషమని బిజెపి సభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు.అనంతరం అయిన మాట్లాడుతూ డా.వేణుగోపాలకృష్ణ వైద్య సేవలను అభినందిస్తూ,కళ రంగాల్లో ఆయన సేవలను కొనియాడారు. ఉత్తమ చిత్రంగా ప్రేమతో నాన్న,ఉత్తమ దర్శకునిగా డా వేణుగోపాలకృష్ణకి,ఉత్తమ నటి సుహాసినికి తన చేతులమీదుగా నంది పురస్కారాలందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.నిర్మల్ ప్రాంతానికి వైద్యరంగం తో పాటు కళారంగంలో కూడా ఇలాంటి వారు ఉండటం గర్వించ దగ్గ విషయం అని అభివర్ణించారు.వారితో పాటు చంద్రకాంత్,బిజెపి నాయకులు ముత్యంరెడ్డి సిబ్బంది పాల్గొని డా.వేణుగోపాలకృష్ణ ని సుహాసిని ని అభినందించారు.